www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 ఏప్రిల్ 2024
5
ఏలూరు



24 గంటల్లో 47.5 లీటర్ల మద్యం స్వాధీనం

ఎస్పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గడచిన 24 గంటల్లో చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 47.5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాటి ద్వారా నగదు, మద్యం అక్రమ రవాణాపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా గడచిన 24 గంటల్లో అనగా మార్చి 31వ తేదీ రాత్రి 7 గంటల నుంచి ఈనెల ఒకటో తేదీ రాత్రి 7:00 వరకు జిల్లా వ్యాప్తంగా 47.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.15,200 ఉంటుందని తెలిపారు. అలాగే ప్రత్యేక తనిఖీల ద్వారా రూ.2 లక్షల 16,600 నగదును గుర్తించామని తెలిపారు. వీటిని స్వాధీన పరుచుకుని నగదు రవాణా చేస్తున్న వారి నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నామని తెలిపారు.



'పింఛన్ల' రగడ..!

- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పింఛన్ల పంపిణీకి వాలంటీర్లు దూరం
- ఎన్నికల స్టంట్‌గా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం
- రెండు జిల్లాల్లో 5.10 లక్షల మంది పింఛన్‌దారులు
- 3 నుంచి పంపిణీకి సన్నాహాలు.. ఎక్కడిస్తారనే దానిపై లేని స్పష్టత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాజిక పింఛన్ల పంపిణీపై నెలకొన్న సందిగ్ధత అధికార, ప్రతిపక్షపార్టీల మధ్య ఎన్నికల స్టంట్‌గా మారింది. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు దీనికి కారణం. పింఛన్ల పంపిణీని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయంటూ వైసిపి విమర్శలు గుప్పిస్తుండగా, తాము అలా చేయలేదంటూ టిడిపి నేతలు తిప్పికొడుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ నెల పింఛన్ల పంపిణీ మూడో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. అయితే ఇంటికి తెచ్చిస్తారా.. లేక పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లాలా అనే దానిపై ఇంకా స్పష్టత రాకపోవడంతో గందరగోళం నెలకొంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వృద్ధాప్య, చేనేత, వితంతు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఇలా 25 రకాలకు చెందిన 5.10 లక్షల మందికి ప్రతినెలా సామాజిక పింఛన్లను ప్రభుత్వం అందిస్తోంది. ఏలూరు జిల్లాలో 2.72 లక్షల మందికి రూ.152 కోట్లు, పశ్చిమగోదావరిలో 2.38 లక్షల మందికి రూ.69.97 కోట్లు సొమ్ము అందిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి 50 ఇళ్లకూ ఒక్కో వాలంటీర్‌ను నియమించింది. వీరే ప్రతినెలా ఇంటికి తెచ్చి పింఛన్‌దార్లకు సొమ్ము అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లు వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయి. దీంతో వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా ఎన్నికల కోడ్ ముగిసే వరకూ పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారం ఎన్నికల స్టంట్‌గా మారిపోయింది. వృద్ధులకు అందే పింఛన్ సొమ్మును టిడిపి, జనసేన, బిజెపి అడ్డుకున్నాయంటూ వైసిపి పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. అయితే పింఛన్ల పంపిణీని తాము అడ్డుకోలేదంటూ టిడిపి, మిత్రపక్షాలు అదేస్థాయిలో తిప్పికొడుతున్నాయి. మార్చి నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సాగుతుందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇంటికి తెచ్చిస్తారా.. పంచాయతీ కార్యాలయాల వద్దే పంపిణీ చేస్తారా అనేది ఇంకా స్పష్టత లేకుండాపోయింది. వాలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదని, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవాలని తెలపడంపై పలుచోట్ల వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సైతం దిగారు. పింఛన్ల వ్యవహారాన్ని వైసిపి ఎన్నికల ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుందని స్పష్టమవుతోంది. అదే సమయంలో సచివాలయ సిబ్బందితో పింఛన్ల సొమ్మును ఇంటికెళ్లి ఇచ్చే అవకాశమున్నా ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదనే చర్చ సైతం నెలకొంది. పింఛన్‌దారులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి తెగ ఆరాట పడుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ

ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఆర్‌డిఎ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా

ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ఇంటింటికి వెళ్లి ఇవ్వడంపై ఇప్పటి వరకూ ఆదేశాలు రాలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ చేపడతాం.

'పది' మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



పది మూల్యాంకనం కేంద్రం వద్ద ఉపాధ్యాయుల నిరీక్షణ

స్థానిక సెయింట్ గ్జేవియర్ బోయ్స్ హైస్కూల్‌లో పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. మూల్యాంకనం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిందని, ప్రశ్నాపత్రాల మూల్యాంకనానికి 1020 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని డిఇఒ అబ్రహం తెలిపారు. వివిధ కారణాల రీత్యా సుమారు 200 మంది ఉపాధ్యాయులను మూల్యాంకనం నుంచి రిలీవ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల ఎనిమిదో తేదీ వరకూ మూల్యాంకనం సాగుతుందని డిఇఒ తెలిపారు.

సకాలంలో పెన్షన్లు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ నిలిపివేయడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సకాలంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులకు పెన్షన్లు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ ఉద్యోగుల సేవలను ఉపయోగించుకుని గతంలోలానే నేరుగా పెన్షన్‌దారులకు సకాలంలో పింఛన్ సొమ్ము అందించాలని కోరారు. సచివాలయాలు దూరంగా ఉన్నచోట దగ్గరలో ఉండే పంచాయతీ కార్యాలయాలు, సిబ్బందిని కూడా దీని కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. రాజకీయంగా న్యూట్రల్‌గా ఉంచి సంక్షేమ పథకాలను అందించాల్సిన వాలంటీర్ వ్యవస్థను రాజకీయ అవసరాల కోసం వైసిపి దుర్వినియోగం చేస్తోందని, గతంలో సిపిఎం ఇదే అంశాన్ని పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దాని ఫలితంగానే నేడు సకాలంలో పెన్షన్లు అందించలేని దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వాలంటీర్ వ్యవస్థ తటస్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వడదెబ్బ ప్రాణాంతకం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అన్ని పంచాయతీలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలచ్చని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. జిల్లాలో ఉన్న కమీషనర్లకు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు చరవాణి ద్వారా ఆదేశాలు జారీచేస్తూ ప్రజలకు, మూగజీవులకు తగినంత తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీ, పట్టణ కార్యాలయాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలని, తప్పనిసరిగా తగినన్ని ఒఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పట్టణాలలో, గ్రామాలలో నిఘా పెంచి ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నమోదైన పేషెంట్స్ స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలకు వడదెబ్బ ఉపశమన సహకారం అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రతి పట్టణాలలో, గ్రామ సచివాలయాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కమిషనర్లకు, ఎంపిడిఒలకు సూచించారు.




సాధ్యమైనంత వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ప్రజలెవ్వరూ బైటకు రాకూడదని సూచించారు. తప్పనిసరి పరిస్థితిలో బైటకు వెళ్లవలసి వస్తే కాటన్ దుస్తులు ధరించాలని, అలాగే గొడుగులు వాడాలని, తలకు టోపీలు ధరించాలని అన్నారు. ఎట్టిపరిస్థితుల్లో నల్ల దుస్తులు వాడకూడదన్నారు. పిల్లలు, వృద్ధులు కుటుంబ సభ్యుల సహకారంతోనే బైటకు వెళ్లాలని, వారితో తప్పనిసరిగా తాగునీరు తీసుకెళ్లాలని సూచించారు. చలవ కళ్లద్దాలు వాడితే మంచిదని, ఎట్టిపరిస్థితిలో శరీరాన్ని నిర్జలీకరణం(డీహైడరేషన్) చేసే కారకాలైన మద్యం, తేనీరు, కాఫీ, కార్బొనేటెడ్ పానీయాలు సేవించకూడదని తెలిపారు. సాధ్యమైనంత ఎక్కువ ప్రతి ఒక్కరూ మజ్జిగ, బార్లీ, తాగునీరు తీసుకువాలని, వీలైనంత వరకు ఇంటి ఆవరణలో చలువ పందిళ్లు వేసి ఎండ తీవ్రత నుంచి రక్షించు కోవాలని సూచించారు. ప్రోటీన్లు ఎక్కువ ఉన్న ఆహారం, నిలవ ఆహారం తీసుకోవద్దని అన్నారు. పిల్లలను, పెంపుడు జంతువులను వాహనాలు పార్కు చేసే ప్రాంతాలలో ఉంచకూడదని అన్నారు. వడదెబ్బ ప్రాణంతకమైనందున వడదెబ్బ తగిలినట్టు ఎవరికైనా అనుమానం ఉంటే చల్లని ప్రదేశంలో సేదతీరాలని, ఆలస్యం చేయకుండా మెరుగైన వైద్యం కోసం దగ్గరలో ఉన్న వైద్యుని సంప్రదించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. అలాగే ప్రజల సహాయార్థం జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సమాచారం కోసం, సహాయర్థం జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిని 94910 41422, 9849903321 నెంబర్లులో సంప్రదించవచ్చని తెలిపారు.

జగన్ హయాంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం యువతని చెడుమార్గంలో పెట్టడానికి విద్యారంగాన్ని ఎంచుకుందని, విద్యారంగంలో వస్తున్న మార్పుల వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గతనెల మార్చి 23వ తేదీన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన, పాటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కాలేజీ స్థాయి, పట్టణ ప్రాంతంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఇవ్వటం జరుగుతుంది. దీనిలో భాగంగా ఏలూరు టౌన్ మొదటి బహుమతి ఆదిత్య కాలేజీ విద్యార్థిని ఎం.రాణికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కళాశాల ప్రిన్సిపల్ కలిసి అందజేశారు. రెండవ బహుమతి సిఆర్‌ఆర్ కాలేజీ ఇంజనీరింగ్ విద్యార్థి ఎం.కృష్ణ, భాను ప్రీతి మూడో బహుమతి తీసుకోవడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి కృషి చేయాల్సిన యువత నేడు మద్యం మత్తులో మునిగి తేలుతుందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని, మద్యం షాపుల వల్ల యువత చెడుదోవ పడుతుందన్నారు. నూతన విద్యా విధానం వల్ల ముఖ్యంగా ఆడపిల్లలకు విద్య దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. మిగతా రాష్ట్రాల్లో, బిజెపి పాలిత ప్రాంతాల్లో కూడా నూతన విద్యా విధానం అమలు చేయడం లేదు కాని ఒక ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే నూతన విద్యా విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 100లో 40 శాతం మందికే విద్యా దీవెన, వసతి దీవెన ఇస్తున్నారని, అవి కూడా దశలవారీగా ఇస్తున్నారన్నారు. ఈవిధంగా చేస్తే విద్యార్థులు ఫీజులు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్పొరేట్ విద్యావ్యవస్థను పెంచి పోషించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని విమర్శించారు. చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిసి కూడా ప్రభుత్వాలు, అధికారులు ఆ విద్యాసంస్థల్ని ఎందుకు మూసివేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి, పెండింగ్‌లో ఉన్న విద్యా బకాయిలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎం.జానకేశ్వరరావు, గర్ల్స్ కన్వీనర్ రాజేశ్వరి, రోహిత, వంశీ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పోస్టల్ బ్యాలెట్ జారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

హోమ్ ఓటింగ్‌కు సంబంధించి సమాచారం సేకరించాలి

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు సంబంధించి రానున్న రెండురోజులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 25 వేల పోస్టల్ బ్యాలెట్స్ అవసరం కాగలవని తెలిపారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గాల వారీగా నివేదికను రూపొందించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సుమారు 11 వేల సిబ్బంది, సుమారు 5 వేల మంది అత్యవసర సేవలకు సంబంధించిన సిబ్బంది, 1800 మంది పోలీసులతోపాటు మిగిలిన 85 సంవత్సరాల వయస్సు నిండిన, వివిధ ప్రతిభావంతులు ఉన్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం 85 సంవత్సరాలు వయస్సు దాటిన ఓటర్లు, వికలాంగుల వద్దనుంచి హోం ఓటింగుకు అభ్యర్థన పత్రాలు తీసుకొని, ఎంతమంది హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నారో వారి జాబితాను రూపొందించాలన్నారు. హోం ఓటింగ్ వినియోగించుకోవాల్సిన వారు ఫారం-12డిని అందజేయాలన్నారు. దీనికి సంబంధించి బిఎల్‌ఒలు, ఆయా సెక్టార్ అధికారులు ఈ విషయంపై పర్యవేక్షించాలని తెలిపారు. అదేవిధంగా ఈ నెలలో నిర్వహించవలసిన పోలింగ్ సిబ్బంది శిక్షణా కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, నూజివీడు ఆర్‌డిఒ వై.భవానిశంకరి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా పటిష్ట ప్రణాళిక

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డికి తెలిపారు. రాష్ట్ర సెక్రటేరియేట్ నుండి సోమవారం వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సిఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో వేడి గాలులు అత్యధికంగా వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా, అందుకు తగిన విధంగా ప్రజలను అప్రమత్తం చేయాలని సిఎస్ ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న పనులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పూర్తిస్థాయిలో నింపుతున్నామన్నారు. శివారు ప్రాంతాలకు కూడా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్ట ప్రాంతంలో బోర్ వెల్స్ పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సూర్యతేజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిపిఒ తూతిక విశ్వనాధ్ శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సత్యనారాయణ, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం

10లోపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గోనె సంచుల కొరత రానీయొద్దు

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

రబీ ధాన్యం సేకరణకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు మందిరంలో జిల్లాలో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 120 రైతుభరోసా కేంద్రాలను ఏప్రిల్ 10వ తేదీకి ధాన్యం సేకరణకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.



రబీ సీజన్లో 79,960 ఎకరాల్లో వరి సాగు చేశారని, 3.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో రబీ ధాన్యం వస్తుందని, అందులో ఎక్కువగా భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మండలాల నుంచి ఉంటుందన్నారు. ఆయా మండలాలవారీ ఏ రోజు ఎంతమేర ధాన్యం వస్తుంది అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సంబంధిత కార్యాచరణ రూపొందించాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 77 లక్షలు గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశామని, అందుకు తగ్గ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. గ్రేడ్-ఎ రకానికి క్వింటాలుకు రూ. 2203, సాధారణ రకానికి రూ.2183 కనీస మద్దతు ధరగా నిర్ణయించారన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎటువంటి రాజకీయ వ్యవహారాలకు తావులేదని స్పష్టం చేశారు. సంచుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని, పాడైపోయిన, చినిగిన గోనె సంచులను సరఫరా చేయకుండా కొత్త సంచులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై సంబంధిత అధికారులకు జెసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆర్‌డిఒలు ఎన్ఎస్ కె.ఖాజావలి, కె.అద్దయ్య, వై.భవానీ శంకరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోటలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ నిర్వహించిన తనిఖీల్లో విజయవాడకు చెందిన వ్యక్తి నుండి రూ.72 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల అధికారి ఎమ్‌డి.మొహిద్దీన్ తెలిపారు. సదరు స్వాధీనపర్చుకున్న నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సత్యవేణికి అందజేశారు. సోమవారం ఎన్నికల చెక్‌పోస్ట్‌ను జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలపై నిఘా పెంచాలని ఆయన సూచించారు. చెక్‌పోస్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం వేగవరం సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేని రూ.69,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును జిల్లా ట్రెజరీకి పంపించినట్లు తహశీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు.

నగదు అక్రమ రవాణా అరికట్టాలి

ఎస్పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నగదు అక్రమ రవాణాలను అరికట్టాలని జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది చెక్‌పోస్టుల్లో పనిచేసే పోలీసు సిబ్బందితో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, నగదు అక్రమ రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని వారికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును ఎప్పటికప్పుడు అధికారులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. మోడల్ ఆఫ్ కండక్టర్స్ అనుసరించి చెక్‌పోస్టులు వద్ద 24 గంటలు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నియమాలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ వాహన తనిఖీలకు సహకరించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ధిక్కరించి, నిబంధనలకు అనుకూలంగా పనిచేయని పక్షంలో వారికి సంబంధించిన ఫిర్యాదులను సి విజిల్ యాప్‌కు అందించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆది ప్రసాద్, 8 చెక్‌పోస్ట్‌లకు సంబంధించిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

వైసిపి చింతలపూడి అభ్యర్థి కంభం విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న నియోజవర్గ వైసిపి అభ్యర్థి విజయరాజు

విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని వైసిపి చింతలపూడి నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలంలోని అన్నపనేనివారిగూడెంలో వైసిపి మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల కాలంలో ప్రజలకు మేలు జరిగితేనే ఓటు వేయండి అని ముఖ్యమంత్రి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. మెడికల్ కాలేజీలు కట్టించారని, కరోనా సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్యాన్ని ఇంటివద్దకు అందించిన ఘనత వైఎస్.జగన్మోహన్ రెడ్డిదని అన్నారు. విద్య ప్రతి పేదవాడికి అందాలని నాడు-నేడు ద్వారా స్కూల్స్ రూపురేఖలు మార్చారన్నారు. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు తీసుకువచ్చి ప్రతి పేద విద్యార్థికి మెరుగైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గాన్ని సుందరీకరణగా మార్చి రోడ్లపై ప్రత్యేక దృష్టి పెడాతనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతూరు రైల్వే గేటుకు మరమ్మతులు

ప్రజాశక్తి - భీమడోలు

సూరప్పగూడెం-పాతూరు గ్రామాల వద్ద రెండు జాతీయ రహదారులు కలుపుతూ ఏర్పాటుచేసిన రోడ్డుపై గల పాతూరు రైల్వే గేటును మరమ్మతుల కారణంగా మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. ఈమేరకు 358 నెంబర్ గల రైల్వే గేటును ఈనెలాఖరు వరకు మూసివేస్తున్నట్లు వివిధ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ రైలు గేట్ ప్రాంతంలో రాకపోకలను సులభతరం చేసేందుకు రైల్వే అధికారులు రైల్వే ట్రాక్ క్రింద అండర్ పాస్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు పూర్తయ్యాయి. అందుబాటులో ఉన్న రోడ్డును అండర్ పాస్‌కు అనుసంధానం చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నందు వల్ల రైల్వే గేటును మూసివేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో రైల్వే గేట్ మీదుగా ప్రయాణించేవారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఎంపిడిఒ కిరణ్ కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవిలో ఎండ వేస్తున్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని ఇంకా ఎక్కడ అవసరమైతే అక్కడ చలివేంద్రాలని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

3వ పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - కామవరపుకోట

ఈనెల మూడవ తేదీ నుంచి సామాజిక పింఛన్లు గ్రామ సచివాలయం సిబ్బందితో గ్రామ సచివాలయాలలో పంపిణీ చేయనున్నట్లు కామవరపుకోట ఎంపిడిఒ జంగం పుష్ప భారతి తెలిపారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల మండలంలోని మొత్తం 16 సచివాలయాల్లో సుమారు 8,315 మంది లబ్ధిదారులకు సుమారు రూ.2 కోట్ల 47 లక్షల 60 వేల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పింఛన్ తీసుకోడం కోసం వెళ్లే సమయంలో తమ ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. ఎండ దృష్ట్యా పింఛన్ దారులు ఇబ్బంది పడకుండా వారికి తాగునీరు, వేడి తగలకుండా షెల్టర్, టెంటులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బాలుడి చేతి వేళ్లకు గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోట గ్రామంలో ఒక బాలుడి చేతి వేళ్లకు గాయాలైన సంఘటన జరిగిందని ముదినేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిగురుకోట శివారు నరసన్నపాలెం గ్రామానికి చెందిన కమ్మ కట్టి మహేష్ ఆకివీడులో హాస్టల్లో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సుమారు పది రోజుల నుంచి ఆరోగ్యం బాగోనందున తన ఇంటికి నరసన్న పాలెం గ్రామం వచ్చి తల్లిదండ్రుల దగ్గర ఉంటున్నాడు. మహేష్ తన బంధువు అయిన దాసి ఆంజనేయులు చిగురుకోట గ్రామంలో చెరువులు మీద గుమస్తాగా పనిచేయడంతో అతనితో పాటు ఆ బాలుడు అప్పుడప్పుడు చెరువు దగ్గరకు వెళుతున్నాడు. ఆ బాలుడు కమ్మ కట్టి మహేష్ రొయ్యల చెరువు దగ్గర వెళ్లే చెరువులపై పిట్టలను బెదర వేయడానికి ఉపయోగించు పటాస్ మందును పొరాపుటట్ బాటిల్‌లో వేసి అగరపుల్లతో అంటించగా అది చేతిలో పేలి కుడి చేతి వేళ్లకు గాయాలైన సంఘటన చోటు చేసుకుందన్నారు. అక్కడ ఎటువంటి తుపాకీ పేలలేదు. తుపాకీ పేలడం అనేది అవాస్తవమని పోలీసులు తెలిపారు. కైకలూరు రూరల్ సిఐ వి.కృష్ణ కుమార్, ఎస్ఐ డి.వెంకట్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'జగన్ హయాంలో రాష్ట్రం వెనుకంజ'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వైసిపి ప్రభుత్వ అధికారంలోకొచ్చిన తరువాత రాష్ట్రం ఎంత వెనుక బాటుకు గురైందో మాకంటే మీడియా మిత్రులకే బాగా తెలుసని నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. ఏలూరు టిడిపి ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ పరిచయ కార్యక్రమం సోమవారం అతిథి హోటల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ పరిధిలో పోలవరం, కొల్లేరు, ఆక్వా లాంటి వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇవన్నీ కూడా ప్రగతి పథంలో ముందుకు సాగాలంటే టిడిపి, జనసేన కూటమి విజయం సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న కారణంగా పింఛన్లు ఇంటికి వచ్చి ఇవ్వడం కుదరకపోవచ్చని అధికారులు చెబుతుంటే దానిని కూడా టిడిపిపై, చంద్రబాబుపై రుద్దడానికి వైసిపి కుట్ర చేస్తుందని అన్నారు. ప్రజలు అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి'

ప్రజాశక్తి - పోలవరం

సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కావాలన్నా, కొనసాగాలన్నా మళ్లీ జగనే రావాలని, జగనన్నను మరోసారి సిఎం చేసే విధంగా ప్రజల మద్దతు కావాలని పోలవరం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు.



ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి

మండలంలో సోమవారం రాజ్యలక్ష్మి ప్రచారం నిర్వహించారు. పాత పోలవరంలో గ్రామ దేవత కడమ్మ తల్లి అమ్మవారి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గడపకూ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పోలవరం నియోజకవర్గంలో ఒక మహిళా అభ్యర్థి ఇప్పటివరకు గెలవడం జరగలేదు, కాబట్టి ప్రతిఒక్క పథకం అక్కా చెల్లెమ్మల ఖాతాలో జమైనందున, మహిళలంతా ఈసారైనా ఈవిధంగా అన్నకి కృతజ్ఞత చెప్పాలన్నారు. ఒక మహిళా అభ్యర్థిగా గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని పోలవరం నియోజకవర్గ ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

భార్యకు గాయాలు

ప్రజాశక్తి- పోలవరం

ఈస్టర్ పండుగ కోసం భార్యతో కలిసి వస్తూ రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెంది, భార్యకు తీవ్ర గాయాలపాలైన సంఘటన కోటరామచంద్రపురం ఐటిడిఎ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన చిన్నం పవన్ కుమార్(28) తన కుటుంబంతో సహా ఇటీవల కన్నాపురం పుగాకు సీజను పనికి మకాం వెళ్ళాడు. ఈస్టర్ పండుగ సందర్భంగా తన భార్యతో బైకుపై పోలవరం వస్తుండగా మార్గమధ్యలో ఐటిడిఎ సమీపంలో మలుపు వద్ద బైకు అదుపు తప్పి చెట్టుని ఢీకొనడంతో పవన్ కుమార్, అతని భార్య వేణుకి తీవ్ర గాయాలు కావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి పవన్ కుమార్ మృతి చెందగా అతని భార్య వేణుని అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలవరం తరలించారు. గత ఐదు నెలల క్రితమే ఇద్దరికి వివాహమైందని, రోడ్డు ప్రమాదం కుటుంబంలో విషాదం మిగిల్చిందని మృతుడి తండ్రి వీరన్న కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ మృతితో కమ్మరగూడెం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని ఉదయ భాస్కర్ కాలనీ సమీపంలోని రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బర్రింకలపాడు గ్రామానికి చెందిన కుంజ ప్రేమ్(28) ద్విచక్ర వాహనంపై జీలుగుమిల్లి నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన చింతలపూడి మండలంలో చోటుచేసుకుంది. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కొవ్వూరుగూడెం గ్రామానికి చెందిన నరం రమేష్ (30) మార్చి నెల 22వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు అయిందని, మార్చి 24వ తేదీన ఇంటికి వచ్చాడని, ఇంటివద్ద మందలించారని, 25వ తేదీన ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని, వారి కుటుంబ సభ్యులు చెప్పారని తెలిపారు. సోమవారం వారి ఇంటి పరిధిలోని తోటలో శవం కుళ్లిపోయి కనిపించిందని తెలిపారు. మణికట్టు వద్ద కత్తితో కోసుకున్నట్లుగా కనిపించిందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి సూపరిటెండెంట్‌గా నరేంద్ర సింగ్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ మోహన్‌రావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను ఉన్నతాధికారులు డాక్టర్ నరేంద్ర సింగ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా నరేంద్ర సింగ్ మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని అధికారుల చొరవతో ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - చింతలపూడి


ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో ఎండల్లో ఉపవాసం ఉంటున్నారని, వారికి బాసటగా ఉండేందుకు తేనీటి విందు ఇచ్చినట్లు ఫాదర్ కామ మ్యాత్యూ అన్నారు. చింతలపూడి పట్టణంలో ముస్లిం మైనారిటీలు చేపట్టిన ఉపవాస తలంపుకు చేయూతగా బోయగూడెం ఆర్‌సియం చర్చి ఫాదర్ కామ మ్యాత్యు అధ్వర్యంలో మూడు వందల మంది ముస్లింలకి తేనీటి విందు అందించారు. ఈ సందర్భంగా ముస్లింలు పవిత్ర మాసంలో ఎండల్లో ఉపవాసం ఉంటున్నారని, వారికి బాసటగా ఉండేందుకు తేనీటి విందు ఇచ్చినట్లు అన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ రహీమ్, కార్యదర్శి జిలానీ, జమాత్ ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఎస్‌కె.హుస్సేన్, అక్బర్ అలి, అజాద్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ముస్లింల అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం సాయంత్రం ఆగిరిపల్లిలోని మక్కా మసీదులో రంజాన్ మాస ఉపవాస దీక్షలో భాగంగా జరిగిన ప్రత్యేక ప్రార్ధనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం షాదీఖానాలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పి.నరశింహారావు, బి.రాంబాబు, హర్ష, భాషా, ఆరీఫ్, ముస్లిం సంఘ నాయకులు పాల్గొన్నారు.

'రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం'

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలిచే వ్యక్తులం మేమంటూ నూజివీడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కంబాల కృష్ణవేణి రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో నూజివీడు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కంబాల కృష్ణవేణి రాంబాబు ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అనంతరం రైతులకు ప్రత్యేక సబ్సిడీతో కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలను, వ్యవసాయ పనిముట్లను, పలు రకాల వస్తువులను రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సబ్సిడీలతో అందజేయడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్ కంబాల దాసు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వాసుబాబు

కొత్తపేటలో 'మన ఊరికి మన వాసన్న'

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ళ గ్రామపంచాయతీ కొత్తపేట ఆవాస ప్రాంతంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు మన ఊరికి మన వాసన్న కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ మేరకు గడపగడపకూ వెళ్ళి ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు జరిగిన ఉపకారాలు గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, ఎంఎల్ఎగా తన విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సువార్తీకులు నాగరాజు మృతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీ కమ్మరగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ దైవ సువార్తీకులు కాట్రు నాగరాజు(జేసుదాసు)(80) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. పోలవరంలో యెరూషలేము హెబ్రోన్ చర్చి ఫాదర్‌గా, గత 50 సంవత్సరాలుగా దైవ సువార్తీకులుగా సేవలందించిన ఆయన మానవత్వానికి, కారుణ్యానికి మతం, కులం లేదని ప్రభోధించేవారని, అన్ని కులాల, మతాల వారిని ప్రేమగా ఆదరించి సువార్త అందించే వారని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ఆయన లేని లోటు తీరనిదని పోలవరం మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు రెవరెండ్ ఆకుమర్తి డేవిడ్ రాజు, పిజె సుధాకర్, సామ్యూల్ రాజు, సంపతిరావు, రొక్కల మేషెక్ అన్నారు. ఆయన మృతి పట్ల క్రైస్తవ విశ్వాసులు, సంఘస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వికలాంగులకు కృత్రిమ కాళ్లను అందజేయడం వల్ల వారు మనోధైర్యంతో జీవించడమే కాకుండా కుటుంబానికి అండగా వుంటారని విజయవాడ లయన్స్ క్లబ్ కృత్రిమ కాళ్ల విభాగపు కో ఆర్డినేటర్ జ్యోసుల శ్రీరామ్ పవన్ అన్నారు. సోమవారం తోటపల్లి హీల్ ప్యారడైజ్ కృత్రిమ అవయవ కేంద్రంలో లయన్స్ డాక్టర్ బావిశెట్టి రమేష్ ఆర్థిక సహాయంతో ప్రకాశం జిల్లాకు చెందిన పునుగోటి బ్రహ్మారెడ్డికి కృత్రిమ కాళు అందజేశారు. ఈ కార్యక్రమంలో హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా, పిఎస్.వరకుమార్ పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

చాట్రాయి: నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటానని ప్రచార నిర్వహించి, భారీ బహిరంగ సభ నిర్వహించిన చిన్నం రామకోటయ్య వైసిపిలోకి చేరటంతో ఆయన మద్దతుదారులు పలువురు టిడిపిలోకి చేరారు. మండలంలోని ఆరుగొలను పేట, చాట్రాయి, చిన్నంపేట గ్రామాలకు చెందిన ప్రముఖులు నూజివీడు నియోజకవర్గం టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో సోమవారం చాట్రాయి మాజీ సర్పంచి సమక్షంలో చేరారు. చేరిన వారిలో కోట జోజి, చిన్నంపేట మాజీ ఎంపిటిసి కలపాల రమేష్, సీనియర్ నాయకులు కొమ్ము ప్రసాద్, కొమ్ము నాగరాజు, రాజేష్, పాపారావు, కొమ్ము ఆశీర్వాదం, దేవంగి మధు, అంబోజి ఆనంద్, కల్లెపల్లి నాగరాజు, ఇడుపుల పాటి నాగేశ్వరారావు, కొమ్ము విక్రమ్, నందిపాం కృష్ణ ఉన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం నూజివీడు నియోజకవర్గ బాధ్యుల సమావేశం ఎస్.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి పని చేస్తున్న కూలీలకు నాలుగు నెలల నుంచి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో కూలీలు, పేదలు నానా అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పనులు ప్రారంభం కాని గ్రామాల్లో వెంటనే ప్రారంభించాలని కోరారు. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, మరోపక్క కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వేతనాలు లేక ఉపాధి కూలీలు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని మంచినీరు, మజ్జిగ, కూలీలకు పే స్లిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ప్రమాదం జరుగుతున్న కూలీలకు మెడికల్ కిట్ ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా నాయకులు ఎం.హెూలీ మేరీ, కొమ్ము ఆనంద్, పి.లక్ష్మయ్య, స్టాలిన్ పాల్గొన్నారు.

కళాకారుడు అప్పారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - కామవరపుకోట

అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన సీనియర్ కంజరి కథ కళాకారుడు కలిగట్ల అప్పారావు మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు సబ్బి కనకారావు, జిల్లా ప్రజానాట్య మండలి సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. మంచిలి అప్పారావు అని పిలిచే ఆయన ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వేలాది కంజరి కథ ప్రదర్శనలు అందించి, లక్షలాదిమంది ప్రేక్షకులను ఆనందపరిచి, ప్రజా సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని, కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చిన ఆయన జీవితం అంతా కళారంగానికి అంకితం చేశారన్నారు. ఆయన మృతి కళా రంగానికి తీరని లోటు అన్నారు. కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్, దాసరి చిన్ని, బుర్రకథ మహిళా సీనియర్ కళాకారుని విభూది రాజేశ్వరి, సీనియర్ కోలాట కళాకారిణి వందలపాటి పద్మావతి, సీనియర్ కంచరీ కథా కళాకారుడు చిలుకూరి సుబ్బయ్య చారి, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ, ప్రజా గాయకుడు కంకిపాటి ఏసుపాదం, వర్ధమాన సినీ నటుడు తిరుపతి రమేష్ బాబు, కళాభిమానులు సాయన్న రాఘవమ్మ, చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కనకరాజు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి సత్యనారాయణ, ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధుసూదన్ రావు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

కైకలూరు నియోజకవర్గంలో వైసిపికు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నోబుల్ శనివారం తన అనుచరులతో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. విజయవాడ పార్టీ కార్యాలయంలో పిసిసి నేత వైఎస్.షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో వైసిపిలో గుబులు మొదలైంది. పార్టీకి వెన్నుగా ఉన్న ఎస్‌సి సామాజిక వర్గం ఓట్లకు భారీ గండి పడనుంది. వైసిపి, టిడిపిల నుంచి సుమారు 300 మంది అనుచరులతో బొడ్డు నోబుల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు మాజీ సొసైటీ ప్రెసిడెంట్ వరిగంజి సామ్యేలు రాజు, ఆచవరం మాజీ సర్పంచి దండె సైమాన్ రాజు, తామరకొల్లు మాజీ సర్పంచి కురేళ్ళ ఇస్సాకు, కలిదిండి వైసిపి నాయకులు ఈదా పద్మారావు, ప్రత్తిపాడు అలెక్స్, పల్లేవాడ వైసిపి నాయకులు బుంగా కాసురాజు, వరహపట్నం వైసిపి నాయకులు పీతల రాంబాబు, రామవరం గరికిముక్కు చిన్ని, యెరిచర్ల శేఖర్,



షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరుతున్న నోబుల్

చిన రామవరం యాళ్ళ ప్రకాశరావు, వదర్లపాడు ఉమ్మెత్త నాగేశ్వరరావు, దొడ్డిపట్ల కోనాల జయరాజు, వాసిపల్లి రమేష్, గుర్వాయిపాలెం నేతల సుందర్, సంతోషపురం జోజిబాబు, తక్కెళ్ళపాడు బుర్లకృష్ణ, నుచ్చిమిల్లి కాటం జానేసు, నందిగామలంక ఈదా విజయరాజు, గుమ్మళ్ళపాడు మేడపాటి సుభాకరరావు, కమతం వెంకటరత్నం పార్టీలో చేరారు. కాంగ్రెస్ నుంచి ఆయన ఎన్నికల బరిలో ఉంటారని తెలిపారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సేవలు వినియోగించుకోవాలి

బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ఎస్‌వి.సుబ్బారావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఖాతాదారుల సౌలభ్యం కొరకు అన్ని రంగాల వారికి అనువైన రుణ సదుపాయాలు సరళమైన వడ్డీ రేట్లకు అందిస్తున్న బ్యాంక్ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అని, ఈ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగపర్చుకోవాలని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆగిరిపల్లి బ్రాంచి మేనేజర్ ఎస్‌వి.సుబ్బారావు కోరారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న డిపాజిట్లపై వడ్డీరేట్లు, డిజిటల్ సేవల ద్వారా లావాదేవీలు, బంగారు అభరణాలపై రుణ సదుపాయం వంటి సేవలపై సోమవారం ఆగిరిపల్లిలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంక్



ప్రచారం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

సిబ్బంది బి.లక్ష్మీదేవి, డిఎస్‌వి.గిరిధర్, జి.అప్పలరాజు, పి.శివరాంబాబు పాల్గొన్నారు.

మరోసారి దళిత మహిళల భూ వివాదం

145 సెక్షన్ అమలులో ఉండగా భూముల్లోకి వెళ్లకూడదు : ఎస్ఐ

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

పెదవేగి మండలం కూచింపూడి రెవెన్యూ పరిధిలో దళిత మహిళలకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి పంపిణీ చేసిన భూములలో సోమవారం మరోసారి వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పెదవేగి ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే ఆ భూములపై ఇప్పటికే 145 సెక్షన్ అమలులో ఉంది. ఈ సెక్షన్‌పై ఆ భూముల్లో అక్రమంగా సాగులో ఉన్న వ్యక్తి కోర్టు కెళ్లి అన్ కంటెస్టడ్‌గా విత్ డ్రా అయ్యాడని, ఈ భూముల్లో ఎటువంటి పోలీస్ పోర్స్ లేదని, మ్యుటేషన్ ఆర్డర్ కూడా 20158/2020లో రద్దైనట్టు మహిళలు తెలుపుతున్నారు. కోర్ట్ ఇన్ని ఉత్తర్వులు దళిత మహిళలకు అనుకూలంగా ఇచ్చినా గత రెండు రోజులు కూడా తమపై పోలీసులు కేసులు నమోదుచేయడం ఏమిటని దళిత మహిళలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌ని వివరణ కోరగా దళిత మహిళలకు కోర్ట్ నుంచి వచ్చిన ఉత్తర్వులు ఏమీ లేవని చెప్పారు. ఆ భూములు సాగుచేస్తున్న రైతు కోర్ట్ నుంచి మరో స్టే ఆర్డర్ తెచ్చారని అన్నారు. దళిత మహిళలు భూముల్లోకి వెళ్లడంతో కొంత మందిపై కేసులు నమోదు చేశామన్నారు. 145 సిఆర్‌పిసి సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ఆ భూముల్లోకి ఎవరూ వెళ్లరాదని పెదవేగి మండల అప్పటి రెవెన్యూ అధికారి నల్లమెల్లి నాగరాజు ఇచ్చిన 145 సిఆర్‌పిసి ఉత్తర్వులు ఆ భూముల్లోకి దళిత మహిళలను వెళ్లనీయకుండా అడ్డుకోమని ఇచ్చారా అని దళిత మహిళలు అధికారులను నిలదీస్తున్నారు. మండల మేజిస్ట్రేట్ ఇచ్చిన 145 సిఆర్‌పిసి సెక్షన్‌కు కూడా విలువలేదా అంటూ వాపోయారు. మా భూములను అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్న భూ స్వామిని భూముల్లోకి అనుమతించమని అధికారులకు సెక్షన్ 145 సిఆర్‌పిసి చెబుతుందా లేదా 145 సెక్షన్‌ని తుంగలోకి తొక్కేసారా? ఇదెక్కడి న్యాయం సార్ అంటూ భూమిపై సర్వ హక్కులు ఉండి రైతు భరోసా కూడా పొందుతున్న యజమానులైన దళిత మహిళలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇప్పించడంలో బుక్ కీపర్ల, వెలుగు సిబ్బంది పాత్ర ఎంతో ఉందని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఫైనాన్స్ ఇయర్ ప్రారంభం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మెమెంటోళ్లను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన డ్వాక్రా సంఘాల ద్వారా గరిష్టంగా ఒక్కొక్క గ్రూపుకి రూ.20 లక్షల చొప్పున రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్ల పాపం జగన్ రెడ్డిదే

టిడిపి దెందులూరు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

అవ్వా, తాతలకు ఇవ్వాల్సిన పింఛన్ల సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు రూ.13 వేల కోట్లు మార్చి 16 - 30 తేదీల మధ్య 15 రోజుల వ్యవధిలోనే సొంత కాంట్రాక్టర్లకు జగన్ రెడ్డి దోచి పెట్టారని దెందులూరు నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని నియోజకవర్గ కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్ సోమవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయించకపోవడానికి నిధుల కొరతే కారణం గాని ఎన్నికల కమీషన్, టిడిపి కాదని, ఈనెల 1వ తేదీ నుంచే ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని జగన్ రెడ్డి ఎందుకు ఆదేశాలు జారీ చేయలేదు? ఖజానాలో నిధులు లేకనే కదా? అని చింతమనేని ప్రభాకర్ ప్రశ్నించారు. 1.35 లక్షల సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లు ఇంటి వద్దే పంపిణీ చేయడం సాధ్యం అని, కానీ నిధుల కొరత వల్లే జగన్ రెడ్డి చర్యలు చేపట్టలేదని అన్నారు.

ముసునూరు: నెల నెలా పంపిణీ చేసే పింఛన్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక మాద్యంతో ఇవ్వలేకపోతే అది టిడిపి ప్రభుత్వంపై నెట్టడం సరికాదని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు అన్నారు. సోమవారం మండలంలోని చక్కపల్లి గ్రామంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు పింఛన్లు ఇవ్వండి, కాకపోతే రాజకీయ ప్రచారం చేయకండి అని ఎన్నికల అధికారి అన్నమాటాలకు టిడిపి స్పందించిందే తప్ప, వాలంటీర్లను తీసేయాలని, లేదా వాలంటీర్లు పింఛన్లు ఇవ్వొదంటూ ఎక్కడా ప్రకటన చేయలేదన్నారు. ఒకటవ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లు ఎందుకు ఇవ్వలేదని ఫించన్‌దారుల వైపు మాట్లాడం తప్ప, అసత్య చారాలు చేయలేదన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి, జనసేనలకు చెందిన పలువురు నాయకులు సోమవారం వైసిపిలో చేరారు. మండలంలోని గురజ గ్రామానికి చెందిన జనసేన మండల గౌరవ అధ్యక్షులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, ఆ పార్టీ మండల కార్యదర్శి నాగదేశి గణేష్, నర్రా ప్రభు, కె.యుగంధర్లు, అలాగే టిడిపికి చెందిన అల్లాడి సతీష్ వైసిపి తీర్థం పుచ్చుకున్నారు.